

# పరవ

వింజమూరు మస్తాన్‌బాబు

చాకలి లచ్చిమి చచ్చిపోయింది.

'లచ్చుమవ్వ చచ్చిపోయిందా?', 'లచ్చిమి పోయిందా,' అని లచ్చింపురంలో పొద్దున్నే అందరి నోటా అదే మాట. చాకలిపాలెంలోని పిల్లాపీసు మొత్తం లచ్చుమవ్వ ఇంటి కాడ మూగతా ఉన్నారు.

అవ్వ పూరిల్లు, చవిటి కొట్టామంతా చాకలోళ్లే.

పెదచాకలి సుబ్బన్న జయకండవ పైనేసుకొని కంగ్రూతంతో ఆదరాబాదరా అవ్వింటి కొచ్చాడు.

అవ్వ తనింట్లోనే నట్టింట ఎల్లకిలా పడుకో నుంది. తాను ప్రేమించే ఇంట్లోనే ప్రాణాలొదిలింది. రోజూ మచ్చు మీదుండే గుడ్డలమూట ఇవాళ అవ్వ పక్కనే ఉంది. అవ్వ కళ్లు పైకప్పు తాటాకుల వైపే చూస్తా ఉన్నాయి.

పెదచాకలి సుబ్బన్న వచ్చే ఏడుపు సంబాళించు కుంటూ అవ్వ కళ్లు మూశాడు. నట్టింటిని తడుము తున్నట్టున్న అవ్వ చేతుల్ని తడిమి ఇక ఆపుకోలేక భోరున ఏడ్చాడు. ఆయన ఏడుపుతో చాకలోళ్ల ఆడోళ్లు, పిల్లోళ్లు పెద్దంగా శోకండాలు మొదలు పెట్టారు.

వడ్ల గరిస పక్కన తలపెట్టి అవ్వను పడుకో బెట్టారు. అడుగుపోయిన గంపను బోర్లించి గంప కింద ప్రమిద వెలిగించి గంప పైన పాతగుడ్డ కప్పారు.

అవ్వ సెంద్రమండలంలో ఏకు ఏకీ ఏకీ అలిసి నిద్రబోతున్నట్లుగా కనిపిస్తా ఉంది.

నాయుడోరు, లేబరోళ్లు, సాయిబులు అందరూ అవ్వింటికి వస్తా ఉన్నారు. ఆడోళ్లు పైటకొంగులు నోటికడ్డం పెట్టుకొని వచ్చి, చూసి కళ్లు తుడుచు కుంటూ పోతా ఉన్నారు.

అవ్వ బతికినన్నాళ్లు ఊరందరికీ చాకిరి చేసి, చచ్చిపోయి ఇవాళ ఊరందరినీ తనింటికి రప్పించు కుంటూ ఉంది.

*

లచ్చుమవ్వకి సుమారుగా డెబ్బయి ఏళ్లుం టాయి. కరణంగారి భార్య తొలికాన్పు పురిటి గుడ్డలు ఉతికేటప్పుడు లచ్చుమవ్వ కాపరానికొచ్చిందంట. లచ్చుమవ్వ పసుపుకుంకాలు నరసతాత తీసుకుపోయి పదమూడేళ్లు దాటింది. ఆయన పోయాక ఆమెకు మిగిలిన ఆస్తిపాస్తులు పూరిల్లు, చవిటికొట్టం, పదిళ్ల చాకిరి.

లచ్చుమవ్వ, నరసతాత బతికినంతకాలం రెక్కల చాకిరిని నమ్ముకొని బతికినోళ్లు. ఇద్దరు కొడుకులనీ ఇద్దరు కూతుళ్లనీ ఆ చాకిరి చేసే పెంచి పెద్ద చేశారు.

పెదకొడుకు కొండయ్య పట్నంపొయ్యి లారీ క్లీనరూ, ఆ తర్వాత ఓనరూ అయ్యాడు. చిన్నకొడుకు వెంకయ్య నాలుగు అచ్చరం ముక్కలు నేర్చుకొని, పట్నంలో సొంతిల్లు కట్టుకొని ముగ్గురు బిడ్డలతో సుఖంగా ఉన్నాడు. కూతుళ్లిద్దరూ కులవృత్తి చేసుకొనే వాళ్ల పెళ్లాలుగా బాగానే బతుకుతున్నారు. అంతా బాగానే ఉన్నట్టే. అయితే బిడ్డలు రెక్కలు వచ్చి ఎగిరి పోయినా, లచ్చుమవ్వకు వాళ్ల ధ్యాసపోలేదు. నరసతాత పోయి ఒంటరితనం వొచ్చినాకైతే బిడ్డల మాటలే ఆమెకు మిగిలాయి.

"చిన్నకొడుకు వెంకయ్యకు చదువు చెప్పించమని పట్టుబట్టింది నేను గదా. ఇవాళ వాడు ఒక ఉద్యోగస్తుడు అయినాడంటే నేను గట్టింగా నిలబడబట్టే కదా. లాకుంటే మీ నరసతాత ఒప్పుకొని ఉండేవాడా?" అనేది పిలకాయలతో.

ఆ చదువు కూడా ఊరికే అయిపోలేదు.

అప్పట్లో నరసతాత లచ్చింపురంకి ఐదుమైళ్ల దూరంలో ఉన్న పెదపైడికి డాకటరు సీరాములు ఇంట్లో గుడ్డలుతకడానికి మసకమసక జాములో నడిచి పోయేవాడు. దానికి ప్రతిఫలంగా పెదపైడి బళ్లో వెంకయ్య సదువు నేర్చుకునేటట్టు, డాకటరోళ్ల ఇంట్లో ఒక పిడస మెతుకులు పెట్టేటట్టు ఒప్పందం కుదిరింది. వెంకయ్య అక్కడ చదువుకుంటుంటే లచ్చుమవ్వ వారానికొకసారి పెదపైడికి పోయి డాకటరు పెళ్లానికి పిండిగొట్టి, జొన్నలిసిరి, చెంబులు తపాలాలు తోమి నానాచాకిరి చేసి వచ్చేది.

అంత చాకిరీ చేసి చదివించినా, కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి, కొడుకులకు కోడళ్లను తెచ్చి వాళ్లందరినీ పట్నానికి పంపించినా ఇంకా వాళ్లకోసం చాకిరీ చేయడం మానలేదు లచ్చుమవ్వ, నరసతాత.

కడుపు కట్టుకొని, నోరు కుట్టుకొని వారికోసం ఆ కానుకా ఈ కానుకా సిద్ధం చేసేవారు. లచ్చింపురం చెరువు ఈటుబోతే సుట్టాలందరికీ ఎండుచాపలు పంపేది లచ్చుమవ్వ. కళ్లాల కాడ కందులు, పెసలు, మినుములు, ఎండుమిరపకాయలు ఆసాముల్ని అడిగి తెచ్చి బిడ్డలకు పంపేది. జాతర్లు, కొలుపులు, పొంగళ్లకి యాటల్ని కోస్తే వచ్చే కాళ్లు, తలకాయలు కాల్చి కూర గొట్టి టిపినీలో బెట్టి కొడుకులకి చేరేవేసేవాడు నరస తాత.

సమర్తలకి, పెళ్లిళ్లకి అవ్వకొచ్చే కోకలు, రయికలు కోడళ్లకి, కూతుళ్లకి ఇచ్చేస్తుంది. ఒక్కోసారి ఆసాములతో రయికముక్కలు వద్దని చొక్కా గుడ్డలడిగి మనవళ్లకి పంపేది అవ్వ. ఆసాములోళ్ల ఆడపిల్లలకి పెళ్లిళ్లు చేసినా, కడుపొస్తే సారె తీసుకుపోయినా, అలాగే వాళ్ల కోడళ్ల కడుపుకు సారెలు పంచినా లచ్చుమవ్వకి 'ఈనాం' కింద వస్తువులు దక్కేవి. అవన్నీ ఇంటికొచ్చే కూతుళ్ల, కోడళ్ల చేతుల్లో పెట్టేది దాచుకోకుండా. వియ్యపురాళ్లకి వక్కలు మూటలు గట్టి పంపేది. బిడ్డల కోసం పున్నీళ్లే పరమాణంగా తాగినోళ్లు లచ్చుమవ్వ, నరసతాత.

ఈ మాట ఊరంతటికీ తెలుసు. చేతిలో ఆకు వక్క పెట్టినా లచ్చుమవ్వ బిడ్డల కోసం ఊరు దాటిస్తా ఉందని గమనించి ఒక్కోసారి పరాచికానికి, 'నువ్వు తింటానంటే పెడతా,' అనేవాళ్లు.

లచ్చుమవ్వ ఊళ్లో దగ్గర కానిది ఎవరికి?

తాను గుడ్డలు పిండని ఇళ్లవాళ్లని కూడా లచ్చుమవ్వ ప్రేమగా పలుకరించేది. అందుకనే లచ్చుమవ్వకి కులమేగానీ మతం లేదు.

సాయిబులకి ఈమధ్య దాకా మసీదు లేదు. నమాజు రాదు. ఈళ్లకుండే జెండా చెట్టుకి నీళ్లుబోసి, కంపగొట్టి పెద్దది జేసింది లచ్చుమవ్వ. కూతుళ్లకి దొరసానమ్మ, మస్తానమ్మ అని పేర్లు కూడా పెట్టుకుంది. అందుకే లచ్చుమవ్వంటే సాయిబులోళ్లకి ప్రాణం. పతి సంవత్సరం పీర్ల పండక్కి చావిటికి సున్నం కొట్టేది, పీర్లు ఊరేగింపప్పుడు దియిటీ పట్టేది నరసతాతే. ప్రతి పీర్ల పండక్కి లచ్చుమవ్వ 'మాబు సుబానికి' సక్కెర చదివిస్తుంది. పండగలప్పుడు సాయిబులు దూద్‌సేమియాలు లచ్చుమవ్వకు పంపడం మర్చిపోయేవారు కాదు.

నాయుడోరు మాత్రం తక్కువా?

చినఅంకపు నాయుడోరికి నాలుగు తరాలు చాకిరి చేసినందుకు అంకపునాయుడు తన కొడుకుల కాడికి అయిదరాబాదు పోతాపోతా లచ్చుమవ్వ, నరస తాతలకు పాటికాడ ఇరవైసెంట్లు మాగాణి ఇచ్చి పోయాడు. ఆ ఇరవై సెంట్ల మాగాణి పాలికిస్తే, నాలుగు బస్తాల వొడ్లు వచ్చేవి. చినకొడుకు వెంకయ్య ఉద్యోగస్తుడు వడ్లు ఆశించడు అని పెదకొడుకు కొండయ్యకి ఆ నాలుగుబస్తాల వడ్లు పంపించేది లచ్చుమవ్వ.

ఆ మాత్రానికే లచ్చుమవ్వ ఆస్థానంలో తమకి రావాల్సిన వందల ఎకరాల భూమిని పెదకొడుక్కి లచ్చుమవ్వ ధారాదత్తం చేసినట్లు, వచ్చినప్పుడు మాటల్లో ఇరుగుపొరుగోళ్లకు అలాంటి అభిప్రాయం కలిగిస్తుంది చిన్నకోడలు.

వయసు పైనబడేకొద్దీ చాకిరి కట్టంగా తోస్తా ఉంది లచ్చుమవ్వ, నరసతాతలకు. గుండెల్లో నెప్పిగా ఉందని ఆకుపసురు వాడతా ఉండే నరసతాత ఉన్నట్టుండి ఒకరోజు కన్నుమూశాడు.

లచ్చుమవ్వకి ఒంటరిజీవితం ఆరంభమయ్యింది. ఇన్నాళ్లు లాగిన బతుకు ఇయ్యాల నుంచి కట్టంగా కనిపిస్తా ఉంది.

నరసతాత గ్యాపకాలతో కలత చెందతా ఉన్న లచ్చుమవ్వని కొన్నాళ్లు తమ దగ్గరుండమని కొడుకులు

పిలిచారు. ఇల్లొదిలి కట్టంగా కొడుకుల కాడికి కదిలింది లచ్చుమవ్వ.

*

కొడుకులు చెరి నాలుగురోజులు బాగానే చూసుకున్నారు.

పట్నంలో అవ్వకి పాలుబోక ఇంటిపక్క లాండ్రీ బండోళ్ల కాడ పొద్దు యల్లదీస్తా ఉండేది. లాండ్రీ బండి కాడ ఒకరోజు గంజికోక మడతపెడతా పెదకోడలు కంటబడింది లచ్చుమవ్వ.

అప్పుడేమీ అనకపోయినా ఇంటికొచ్చాక దులిపి వదిలిపెట్టింది పెద్దకోడలు.

"నువ్విలాంటి పరువుతక్కువ పని చేయమాకు. మేము సాకలోల్లమని ఇక్కడెవరికీ తెలియదు. పెద్ద కులపోళ్లుగా గౌరవంగా బతకతా ఉన్నాం. నీ మూలాన మేము బజార్నపడి, మా బిడ్డల్ని తిరక్కుండా జేసేటట్టుండావ్," అని కొడుకు ముందే జాడించి వదిలిపెట్టింది.

కొడుకు నోరు మెదపలేదు.

ఇంకోరోజు చినకొడుకు కూతురు వాళ్లమ్మతో 'చాకల్ది వచ్చింది బట్టలెయ్యి,' అని వాకిట బయట నిలుచొని ఉన్న చాకలామెను చూసి అనడం అవ్వ కంటపడింది. ప్రాణం విలవిలలాడింది.

"నువ్వు కూడా చాకలిదానివే తల్లీ. మనవాళ్లని మనం తక్కువచేసి మాట్లాడకూడదమ్మా," అంది ఉండబట్టలేక.

అంతే. పెద్ద రణరంగం అయిపోయింది. తల్లీ కూతుళ్లు కలిసి లచ్చుమవ్వను అనరాని మాటలు అన్నారు. ఆ రాత్రి లచ్చుమవ్వ అన్నం తినకుండా మంచాన ముడుక్కుంది.

ఎన్ని పనులు చేస్తే, ఎంత పోరాటం చేస్తే ఇవాళ ఈ పట్నం మనవరాలు టిప్పుటాపుగా బజారున నడస్తా ఉందో కదా అని అవ్వ బాధతో మూలిగింది. తిండి గింజల కోసం పెద్దవాళ్లతో పడిన తగాదా ఆమెకు గుర్తుకు వచ్చింది.

ఒకసారి నరసతాతను పెరుమాళ్లనాయుడోరు కొట్టాడు.

అప్పటికి ఆయన కాపరం దోసకాయ నుంచి గుమ్మడికాయంత పెరిగి ఉంది. కమతం పెరిగినా 'మేర' పెరగకపోయేసరికి ఆయనకూ నరసతాతకూ తకరారు వచ్చింది.

"అయ్యా, ఇప్పటికి పది సంవత్సరాల నుంచి మేర పెరగలేదు. రేపట మాపట ముద్దయితే యేస్తా ఉండావు. కానీ ఆరికబియ్యం, క్యాసరి బియ్యపు కూడు మీరు తిని సాకలోళ్లకి, పనోళ్లకి మాత్రం జొన్నకూడూ, సజ్జకూడూ పెడతా ఉన్నారు. నాకూ బిడ్డలు ఉన్నారు. వాళ్లకి ఒకపూట మెతుకులు పెట్టండయ్యా," అని అడిగాడు నరసతాత.

పెరుమాళ్లనాయుడు మొదలే పెడద్రపు మనిషి.

"రెండొందల ఎకరాల ఆసామి బిడ్డలు తినే కూడు నీ బిడ్డలకు కావాలంట్రా. ఇన్నేళ్లు నీ అబ్బా నువ్వూ ఏం తిని బతికారు? తలబిరుసుగా ఇవాళ మాట్లాడతా ఉన్నావ్. నువ్వు గాకపోతే ఆ జొన్నముద్ద కావల్సినోడే వస్తాడు. ముందు నా వాకిలి దాటరా," అని కుతిక మీద చెయ్యివేసి నరసతాతను బయటకు నెట్టాడు.

ఇది చూసి పెరుమాళ్లనాయుడు పెదకొడుకు పిచ్చయ్యనాయుడు చెప్పు తీసుకొని నరసతాతను కొట్టాడు.

పంచాయితీ జరిగింది.

కచ్చిరికాడికి నరసతాత, లచ్చుమవ్వ వచ్చారు.

పెదకాపు వరపునాయుడు, 'చాకలోళ్లకి ముద్ద తప్ప మెతుకులు వేసేది లేదు,' అని తీర్మానం చేశాడు.

అప్పుడు లచ్చుమవ్వ, "పెదనాయుడా, మేము కట్టాన్ని నమ్ముకోని కడుపుకోసం బతికేటోళ్లం. మా బిడ్డలకి చాకిరి నేర్పాలన్నా వాళ్లకి నాలుగు మెతుకులు పెట్టుకోవలగదయ్యా. మా బిడ్డలకు మెతుకులు పెట్టలేనప్పుడు మేము మాత్రం ఇక్కడ చాకిరి చేయడం ఎందుకయ్యా," అని లేచింది. అవ్వతోబాటు పెద చాకలి సుబ్బన్న, తక్కిన చాకలోళ్లందరూ లేచారు.

పంచాయితీ అయిపోయింది. కచ్చిరికాడ దీపాన్ని తలారి కొండయ్య ఆర్పిపోయాడు.

కానీ చాకలిపాలెంలో అసలు సందేళ యెలిగిన దీపాలు ఆరిపోలేదు. ఆ రాత్రంతా అట్టాగే ఎలగతా ఉండి నాయ్.

పీసుపీసు తెల్లారేసరికి తెలిసింది నాయుడోరికి. చాకలోళ్లు పాలెంపాలెంగా ఊరొదిలిపెట్టిపోతా ఉన్నారని. పొద్దున్నే సూర్యుడు వచ్చేసరికల్లా చాకలోళ్లకి ఒక పూట మెతుకులు అందినాయ్. ఆయాల నుంచే చాకలోళ్ల పిలకాయలకి కూడు రుచి తెలిసింది.

అట్టా కష్టం చేసి, కూడు రుచి తెలిపి పెంచిన పిల్లలు ఆ కష్టాలనీ, కులాన్నీ మర్చిపోవడం లచ్చుమవ్వకు నచ్చలేదు. కులాన్ని చెప్పుకోలేని వాళ్ల దగ్గర పరాయిమనిషిగా ఆమెకు కాలు నిలవలేదు.

ఆ రాత్రి తెల్లారనిచ్చి మాటమాత్రం చెప్పకుండా అవ్వ తన ఊరు చేరింది. ఊరు చేరగానే నేరుగా చాకి రేవు కాడికి పోయింది. నరసతాత ఉతికే బండను కళ్ల కద్దుకుంది. పక్క పొదలోని బానను తడిమింది.

తిరిగి బట్టలు పిండడం ప్రారంభించింది.

రానురాను అవ్వ మెత్తబడింది.

అవ్వ చాకిరి రెండిళ్ల నీరుకాయల పంచలకాడికి సన్నబడింది.

ఎండాకాలం చెర్లో నీళ్లు ఇంకిపోతే ఏటికి మూటేసుకొని పోతా ఎన్నిసార్లు ఎండగాలులకి కళ్లు తిరిగిపడిందో. వానలప్పుడు చెరువుకట్ట మీద ఎన్నిసార్లు కాలు జారిందో.

'నన్ను ఆ మడేలయ్యే రచ్చించాల,' అని లచ్చు మవ్వ లోగొంతుకతో అనేది. ఆ మాట వింటే ఆడోళ్లకి ఏడుపొచ్చేది. కానీ లచ్చుమవ్వ ఏడ్చేది కాదు. ఇప్పుడే కాదు అసలు ఎప్పుడూ ఆమె కంట కన్నీరు రాగా ఎవరూ చూడలేదు.

లచ్చుమవ్వ పెద్దబొట్టు పెట్టుకొని ఎదురొస్తే మంచి జరగద్దని అనుకునే లచ్చింపురపోళ్లు నరసతాత పోయాక కూడా ఆమెను ముత్తయిదుగానే చూశారు. ఎవరైనా ఎదురొచ్చినప్పుడు లచ్చుమవ్వ పక్కకి తొలిగి పోతే నాయుడోరి పెద్దోళ్లు- "లచ్చిమే... నువ్వెందుకే పక్కకు బోతావు? మైలంటని కులపోళ్లకే పెద్దదిక్కువి. నువ్వు ఎదురొస్తే ఇంక మాకంతా మంచి జరిగినట్టేనే," అనేవారు.

చాకలిపాలెంలో కొత్తగా కాపరానికి వెళ్లే ఆడ పిల్లోల్లు అవ్వకాడికొచ్చి ఆకూవక్కా ఇచ్చి కాళ్లకి దండం పెట్టి, 'అవ్వా పొయ్యొస్తా,' అని చెప్పేవాళ్లు. లచ్చుమవ్వ మసక కళ్లతో తల నిమిరి, ముఖం భుజాలు తడిమేది. అది చూసి ఆ పిల్ల అమ్మా అబ్బ కళ్లు తుడుచుకొని సంతోషంగా పొయ్యేవాళ్లు.

రావలసిన వాళ్లంతా వచ్చారు.

*

అవ్వను కూచోబెట్టి అభిమానమున్నోళ్లందరూ అనురాగాన్ని కుమ్మరిస్తా ఉన్నారు. అందరూ చివరసారి లచ్చుమవ్వకు దణ్ణం పెట్టుకుంటా ఉన్నారు.

లచ్చుమవ్వ ప్రాణం లేని మొకం శాంతంగా వుంది. ఆమె మొకం తరతరాలుగా చాకిరీ చేసిన జాతికి ప్రతీకగా అలసిపోయినట్టుగా ఉంది. కుంగిన ఆమె భుజాలు ఎందరి మైలను మోశాయో. ఎండిన ఆమె చేతులు ఎందరి మురికిని కడిగాయో.

కనురెప్పలు మూసిన లచ్చుమవ్వ కళ్ల నుంచి కన్నీళ్లు కారతా ఉన్నాయి.

ఇన్నేళ్లు ఇంకిన కన్నీళ్లు ఆమె చెంపల మీద పరిగెత్తతా ఉన్నాయి.

ఆ పరుగులన్నీ కలిసి 'పరవై' పారతా ఉన్నాయ్.

ఆ నీళ్లలో కన్నెపిల్లల కోసం పేగులు మూట కట్టుకున్నోళ్ల ఆకలిపాట వినిపిస్తా ఉంది.

రగతం పంచినోళ్ల కోసం ఎముకలు చేసే బండ మోతలు ఇనిపిస్తా ఉన్నాయి.

ఆ నీళ్లలో రగతం ఇగిరినోళ్లని కరస్తా ఉన్న ఇనప పెపంచపు ఇకారాలు ఇనిపిస్తా ఉన్నాయి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 13 జూన్ 2004*

